

కోలిండియా టోర్నీకి సిద్ధం

నేడు, రేపు జరిగే కోలిండియాస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం ముస్తాబైంది.

8లో



అపు'రూపం'..

కవలలు ఎక్కడున్నా ప్రత్యేకత ఉంటుంది. ఒకే రూపంలో ఉండటంతో అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటారు.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 20°

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మావోయిస్టులపై నిఘా ఉంచాలి



పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

గుండాల: ఏజెన్సీలో మావోయిస్టులపై నిఘా ఉంచాలని ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలపై నిఘా పెట్టాలని చెప్పారు. వాహనాల తనిఖీలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్ పాల్గొన్నారు.

మునగ సాగుతో రైతులకు ఆదాయం

అశ్వారావుపేటరూరల్: మునగ పంట సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మునగ తోటను ఆయన పరిశీలించి మాట్లాడారు. మునగ పంటను పామాయిల్ తోటల్లో అంతర్ పంటగా సాగు చేసుకోవచ్చని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఈ పంట సాగును మరింత విస్తరించాలని, ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్, ఏఈవోలు రవీంద్ర, షాకీరా భాను, రైతులు పాల్గొన్నారు.

పొగాకు గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

అశ్వారావుపేటరూరల్: వర్జీనియా పొగాకు గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటించాలని జంగారెడ్డిగూడెం(ఏపీ) పొగాకు బోర్డు వేలం కేంద్రం సూపరింటెండెంట్ సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పొగాకు తోటలను ఆయన సందర్శించారు. బ్యారన్ల వద్ద చేస్తున్న పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రైతుల సమావేశంలో మాట్లాడారు. కనీస మద్దతు ధర దక్కాలంటే తోటల సాగు, గ్రేడింగ్‌లో పద్ధతులు పాటించాలని, అధికంగా పురుగుల మందులను వినియోగించవద్దని చెప్పారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి ప్రశాంత్, మాజీ పొగాకు బోర్డు మెంబర్ సుంకవల్లి వీరభద్రరావు, వేముల ప్రకాశ్ రావు, కోడూరి నాగు, సతీష్, బ్రహ్మాజీ, పొగాకు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తాగునీరు రాకపోయినా, పైపుల లీకేజీ ఉన్నా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08744–241950 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్‌కాల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌ను ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో టోల్‌ఫ్రీ నంబర్ 18005994007కు కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

క్విజ్, ఇన్నోవేషన్స్‌పై విద్యార్థులకు పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9, 10వ తరగతులు, ఇంటర్ విద్యార్థులకు క్విజ్, పోస్టర్, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు, ఇండియా క్లైమేట్ చేంజ్ మిటిగేషన్ టెక్నాలజీ అనే అంశాలపై మాత్రమే పోస్టర్లు తయారు చేయాలని పేర్కొన్నారు. క్విజ్, పోస్టర్ పోటీలు ఈ నెల 27న పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్ అనే అంశం ఆధారం చేసుకుని ఎగ్జిబిట్ మోడల్స్, వర్కింగ్ మోడల్స్, ప్రాజెక్టులు రూపొందించుకోవాలని కోరారు. ప్రాజెక్టులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను గూగుల్ డ్రైవ్ లింక్ ద్వారా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్‌లోడ్ చేయాలని సూచించారు. విజేతలుగా ఎంపికైనవారు రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఉండాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 040–29560518లో సంప్రదించాలని కోరారు.

మిథిలా స్టేడియంలో పునాదుల దశలోనే ఉన్న ఓపెన్ షెడ్ నిర్మాణ పనులు



నలభై రోజుల్లో నవమి.. పునాదుల్లోనే పనులు

భద్రాచలంలో నిలిచిన ఓపెన్ షెడ్, డార్మెటరీ నిర్మాణాలు

- కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో 'ప్రసాద్' పనుల్లో తీవ్ర జాప్యం
- ఈ ఏడాదైనా శ్రీరామనవమి వేడుకల్లో భక్తులకు ఇక్కట్లు తప్పేనా!

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఏటా వసతి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ ఆగ్‌మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్) పథకంలో భాగంగా రెండేళ్ల క్రితం డార్మెటరీ హాళ్లు, శాశ్వత షెడ్ తదితర నిర్మాణాలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సమయం సమీపిస్తుండగా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే నవమికి కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

ఏప్రిల్ 6న శ్రీరామనవమి

ప్రసాద్ పథకంలో భాగంగా మిథిలా స్టేడియంలో వీఐపీలు, భక్తులు కూర్చుని కల్యాణం వీక్షించేందుకు ఏడాది క్రితం ఓపెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించారు. గతేడాది శ్రీరామనవమి తర్వాత పనులు చేపట్టగా, 2024 డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పనులు పునాదులను దాటలేదు. ఒకవైపు బేస్‌మెంట్ వరకు పిల్లర్ల నిర్మాణం జరగ్గా, మరో వైపు పిల్లర్ల నిర్మాణమే జరగలేదు. గడువు ముగియడంతో పనుల తిరిగి ప్రారంభానికి అధికారులు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. కాంట్రాక్టర్ అలసత్వం, అధికారుల పర్యవేక్షణలోపంతో గడువులోగా పనులు పూర్తికాకపోగా, పనులకు తిరిగి అనుమతులు తీసుకోవడంలోనూ అధికారులు జాప్యం చేస్తున్నారు. వచ్చే ఏప్రిల్ 6న మిథిలా స్టేడియంలో శ్రీ సీతారాముల కల్యాణం, 7న పట్టాభిషేక మహోత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. వేడుకలకు సుమారు 40 రోజుల గడువు ఉండగా, ఆలోగా పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. కనీసం పునాదుల వరకైనా పిల్లర్లను పూర్తిచేస్తే కల్యాణ వీక్షణానికి ఆటంకం లేకుండా ఉంటుంది.

పూర్తికాని డార్మెటరీ నిర్మాణ పనులు

ఇక మిథిలా స్టేడియం వెనుక భాగంలో వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించే రెండెకరాల స్థలంలో జీ ప్లస్–2 నిర్మాణంలో డార్మెటరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. బ్రిడ్జి సెంటర్‌లోని 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో భక్తుల వసతి కోసం మరో భవనం, పర్ణశాలలో ఇంకో భవన నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ఇవి 2023, మేలో ప్రారంభం కాగా 2024, జూలై 30వ తేదీ నాటికి పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది. కానీ ఇంకా పూర్తి చేయలేదు. బ్రిడ్జి సెంటర్‌లో, పర్ణశాలలోని నిర్మాణ పనులను నిబంధనల మేరకు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ వినతి మేరకు డిసెంబర్ 2024 వరకు గడువు పెంచినా స్టేడియం వెనుక డార్మెటరీ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ లెవల్ మాత్రమే పూర్తి కాగా, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన పనులు కొంతమేర జరిగాయి. ఏడాదిలో పూర్తి కావాల్సిన నిర్మాణాలు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండేళ్లు గడిచినా పూర్తికాలేదు. గడువు పెంపు కోసం కేంద్ర పర్యాటక శాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. వారి నుంచి అనుమతులు రాగానే మళ్లీ పనులు ప్రారంభించి ఈ ఏడాది జూన్, ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించటం లేదు.



గడువు ముగియటంతో నిలిచిన డార్మెటరీ నిర్మాణం

బడ్జెట్ ఇతర పనులకు మళ్లింపు..

ప్రసాద్ పథకంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.7 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఆలయ మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఈ పనులు ప్రారంభమే కాలేదు. దీంతో ప్రసాద్ పథకం నిధులను భద్రాచలం, పర్ణశాలలో మరికొన్ని అభివృద్ధి పనులకు వినియోగించేలా బడ్జెట్ మళ్లింపునకు టూరిజం అధికారులకు నివేదిక అందజేశారు. రూ.4 కోట్లతో పర్ణశాలలో పనులు, ఇతర రూ.3 కోట్లను ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనుల్లో పెరిగిన బడ్జెట్‌కు, బోటింగ్ పాయింట్, మోటార్ బోట్ల కొనుగోలు, ఇతర టూరిజం పనులకు సర్దుబాటు చేయాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే నిధుల మళ్లింపు జరిగే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాం

ప్రసాద్ పథకంలో చేపట్టిన ఓపెన్ షెడ్, డార్మెటరీ హాల్ నిర్మాణాలు గతేడాది డిసెంబర్‌కే పూర్తి కావాల్సి ఉంది. గడువులోగా పూర్తి కాకపోవడంతో కాంట్రాక్టర్‌పై తీసుకోవాల్సిన చర్యలతో పాటు మళ్లీ అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. నవమి నాటికి ఓపెన్ షెడ్‌ను పూర్తి చేస్తాం. బ్రిడ్జి సెంటర్‌లో, పర్ణశాలలో చేపట్టి పనులు వచ్చే జూలైలోగా పూర్తిచేస్తాం.

– నిమ్మల రామకృష్ణ, డీఈ, టూరిజం శాఖ

వట్టిపోతున్న వాగులు



ఇసుక తవ్వకాలు జరిపిన ములకలపల్లి మండలంలోని పెద్దవాగు

- నిషేధం ఉన్నా వాగుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- జిల్లాలో అమలుకు నోచుకోని వాల్టా చట్టం
- ఇసుక మాఫియా ధాటికి రూపు కోల్పోతున్న వాగులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లావ్యాప్తంగా లోకల్ ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఆరు నెలలుగా అడ్డూఅదుపు లేకుండా స్థానిక వాగుల నుంచి ఎడాపెడా ఇసుక తోడేస్తోంది. దీంతో వాగుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వాగుల వెంబడి ఏర్పాటు చేసిన చిన్న తరహా ఎత్తిపోతల పథకాలు నిష్ఫలం అయ్యే ప్రమాదం ఉంది. భూగర్భ జలమట్టం కూడా పడిపోయే అవకాశం ఉంది. నిత్యం జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదు అవుతున్నా ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట పడటంలేదు.

తెలంగాణ శాండ్ మైనింగ్ రూల్స్

తెలంగాణ ఏర్పడ్డాక ఇసుక తవ్వకాలకు సంబంధించి 2015 జనవరిలో ప్రత్యేక జీఓ జారీ చేశారు. దీని ప్రకారం వాగులు, వంకలు, వర్రెలను కేటగిరీ–1, 2ల కింద పేర్కొన్నారు. కిన్నెరసాని వంటి ఉపనదులు కేటగిరీ–3లో ఉండగా, గోదావరి నది కేటగిరీ–4లో ఉంది. జిల్లాలో ప్రస్తుతం కేటగిరీ–4లో ఉన్న గోదావరిలోనే ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కిన్నెరసానితో సహా ముర్రేడు, పెద్దవాగు, గోధుమ తదితర వాగుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. మండలాల వారీగా ఎక్కడికక్కడ వెలిసిన సరికొత్త ఇసుక మాఫియాలు వాగులు, వంకల్లో రెచ్చిపోతున్నాయి. ఆరంభంలో కేవలం ఎడ్ల బండి ద్వారా స్థానిక అవసరాలు తీర్చారు. కానీ ఆ తర్వాత ఆర్గనైజ్డ్‌గా సహజ సంపదను లూటీ చేస్తున్నారు. రాత్రయితే చాలు జేసీబీల సాయంతో ఇసుక ఎడాపెడా తోడేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా స్టాక్ పాయింట్‌కు తరలించి అక్కడి నుంచి లారీల ద్వారా బయటి ప్రాంతాలకు ఇసుకను అమ్మేస్తున్నారు.

ప్రమాదకర స్థాయిలో..

వాగులు, వంకలు, వర్రెల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు వాల్టా చట్టం అమలు చేయడంలేదు. పగలు రాత్రి తేడా లేకుండా కూలీలు, జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో వాగుల్లోని ఇసుక తోడేస్తున్నారు. వారం పది రోజుల వ్యవధిలోనే వాగులు, వర్రెల్లోని ఇసుక మేటలు అదృశ్యమైపోతున్నాయి. వాగు అంచుల్లో ఇసుక తోడటంతో ఇప్పటికే ఒడ్డు కోతకు గురై వందల ఎకరాల వ్యవసాయ భూమి దెబ్బతిన్నది. లోతు ఎక్కువగా తోడటం వల్ల ఇసుక మేటలు కనీస స్థాయిలో లేక భూగర్భ జలాలు తగ్గే ప్రమాదానికి చేరువ అవుతున్నాం. ఫలితంగా వాగుల వెంబడి సాగు నీటికి బోర్లు వేయాల్సి దుస్థితి కూడా దాపురిస్తోంది. ఆఖరికి వంతెన సమీపంలో కూడా ఇసుకను వదిలేయడం లేదు. భారీగా ఇసుక తరలిస్తుండటంతో పలు వంతెనల మనుగడ ప్రమాదంలో పడింది.

వాల్టా చట్టానికి తూట్లు

వాల్టా చట్టం ప్రకారం ఇసుక మేటల దగ్గర ఉపరితలం నుంచి మూడు మీటర్లలోతు వరకే శాండ్ మైనింగ్ చేయాలి. అంతకు మించి లోతుకు వెళ్తే భూగర్భ జలమట్టం పడిపోతుంది. గట్టు నుంచి వాగు వెడల్పులో నాలుగోవంతు దూరం వదిలి, ఆ తర్వాత నుంచి ఇసుక తీయాలి. లేదంటే వరద వచ్చినప్పుడు గట్టు కోతకు గురై పంటపొలాలను నష్టపోవాల్సి ఉంటుంది. ఇక వాగుల్లో ఉండే వంతెనలకు ఇరువైపులా అర కిలోమీటరు దూరం వరకు ఇసుక తీయొద్దు. ఈ జాగ్రత్త పాటించకపోతే సదరు నిర్మాణాలు కూలిపోయే ప్రమాదముంది.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- మెనూ అమలు, పరిసరాల పరిశుభ్రతపై పరిశీలన
- బూర్గంపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌లో రాత్రి బస

బూర్గంపాడు: బూర్గంపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకుల నాణ్యత, బియ్యం స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. సరుకులు నాణ్యంగా ఉంటేనే వంట చేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం టాయిలెట్స్, బాత్‌రూమ్స్, కిచెన్ పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు తీయించాలని చెప్పారు. మరుగుదొడ్లు ప్రతిరోజు శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులు నిద్రించే బెడ్లను పరిశీలించి, బెడ్స్ అందరికీ సరిపోతున్నాయా...లేకపోతే ఎవరైనా నేలపై పడుకుంటున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. స్టడీ అవర్‌లో విద్యార్థులకు గణితంలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వ్యక్తిత్వ వికాసం, లక్ష్యసాధనపై విద్యార్థులతో చర్చించారు. ఒత్తిడి లేకుండా నిర్భయంగా చదువుకోవాలని, వెనుకబడిన సబ్జెక్ట్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతీ విద్యార్థి జీవితాన్ని పదో తరగతి ఫలితమే మలుపు తిప్పుతుందన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసిన కలెక్టర్ రాత్రి అక్కడే బస చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, హాస్టల్ వార్డెన్, సిబ్బంది ఉన్నారు.



బూర్గంపాడు ఎస్సీ హాస్టల్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



భవిత కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

భవిత కేంద్రాలతో ఉజ్వల భవిష్యత్

కొత్తగూడెం అర్బన్/పాల్వంచ: దివ్యాంగ బాలల ఉజ్వల భవిష్యత్‌కు భవిత కేంద్రాలు తోడ్పాటునందిస్తున్నాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం రైటర్ బస్తీలోని, పాల్వంచలోని భవిత కేంద్రాలను పరిశీలించి దివ్యాంగ పిల్లలకు కావాల్సిన ఉపకరణాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెంలో పాత భవనం తొలగించి ఆట స్థలం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి, ఎస్.సైదులు, శ్రీరామ్మూర్తి, శ్రీరామ్, కనకదుర్గ, అరుణ, అనిత పాల్గొన్నారు.

'జియోథర్మల్'లో ముందడుగు

- పూర్తిస్థాయి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి నమోదు
- పగిడేరులో దేశంలోనే మొట్టమొదటి ప్లాంట్



పగిడేరులోని జియో థర్మల్ కేంద్రం (ఇన్‌సెట్) 20 కేవీ విద్యుదుత్పత్తి చూపిస్తున్న ప్యానల్ బోర్డు

మణుగూరు టౌన్: సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులో ముందుడుగు పడింది. మండలంలోని పగిడేరులో బోరు నుంచి వస్తున్న వేడినీటితో జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని కొన్నేళ్ల క్రితం గుర్తించగా 20 కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. క్లోజ్డ్ లూప్ బైనరీ ఆర్గానిక్ ర్యాంకిన్ సైకిల్(ఓఆర్‌సీ) టెక్నాలజీతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్‌ను సింగరేణి ఆధ్వర్యాన ఢిల్లీలోని శ్రీరాం ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ బాధ్యులు చేపట్టారు. ఈమేరకు రెండు రోజులుగా ఇక్కడ ప్రయోగాత్మకంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా 20 కిలోవాట్ల పూర్తిస్థాయి సామర్థ్యంతో నమోదైంది. ఇది విజయవంతమైన నేపథ్యాన ఇంకొన్ని పరీక్షలు చేసి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

దేశంలోనే తొలి కేంద్రం

జియోథర్మల్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి కేంద్రప్రభుత్వం 1960 నుంచే 'హాట్ స్ప్రింగ్స్' కమిటీ ఏర్పాటు చేసి పరిశోధనలు చేయిస్తోంది. ఈక్రమాన 1992లో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మణికరణ్ ప్రాంతంలో ఐదు కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసినా కొండచరియలు విరిగి పడడంతో అది ధ్వంసమైంది. ఆతర్వాత పలు రాష్ట్రాల్లో జియోథర్మల్ కోసం అన్వేషణలు సాగించినా విజయవంతం కాలేదు. చివరకు పగిడేరులో బొగ్గు అన్వేషణకు వేసిన బోర్ నుంచి వేడినీరు ఉబికి వస్తుండడంతో జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుచేశారు. కాగా, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఉత్పత్తి పూర్తిస్థాయిలో నమోదైన నేపథ్యాన దేశంలోనే తొలి ప్లాంట్‌గా నిలవనుంది.

అకాల వర్షంతో రైతుల ఆందోళన

- ఈదురు గాలులకు నేలవాలిన మొక్కజొన్న
- పలుచోట్ల తేలికపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం

దమ్మపేట/ములకలపల్లి/టేకులపల్లి/జూలూరుపాడు/చండ్రుగొండ: అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందారు. ఈదురుగాలులకు మొక్కజొన్న పంట నేలవాలింది. కల్లాల్లో ఉన్న మిర్చి రాశులు తడిసిపోతాయేమోనని ఉరుకులు, పరుగులతో పట్టాలు కప్పి పంటను కాపాడుకున్నారు. శుక్రవారం జిల్లాలో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులకు టేకులపల్లి మండలంలో వందల ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. మంగలితండాలో లకావత్ సురేష్‌కు చెందిన రెండెకరాలు, లకావత్ దేవాకు చెందిన ఐదు ఎకరాలు, బేతంపూడి, కుంటల్ల తదితర గ్రామాల్లో పలువురి రైతుల మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. దమ్మపేట, జూలూరుపాడు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో చిరుజల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడ్డారు. జూలూరుపాడు మండలంలో కల్లాల్లోని మిర్చి పాక్షికంగా తడిసింది. లైన్‌తండా, చింతలతండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం, తవిసిగుట్టతండా, గిద్దలగూడెం, మాచినేనిపేట గ్రామాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ములకలపల్లి మండలంలో మేఘాలు దట్టంగా అలుముకోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. చండ్రుగొండ మండలంలో అరకొరగా చేతికొచ్చిన మిర్చి పంట అకాలవర్షంతో కొంతమేర దెబ్బతిన్నది.



టేకులపల్లి: దాసుతండాలో నేలవాలిన మొక్కజొన్న పంట

గణితం, ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించాలి

దుమ్ముగూడెం: గిరిజన విద్యార్థుల్లో గణితం, ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఇందుకోసం ఉద్దీపకం వర్క్ బుక్‌లు, వేదిక్ మ్యాథ్స్ పుస్తకాలను వినియోగించాలని తెలిపారు. దుమ్ముగూడెం మండలం రామచంద్రునిపేట, రేగుబల్లి–2, ఏజీహెచ్‌ఎస్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. 3 నుంచి 5వ తరగతి వరకు చదివే గిరిజన విద్యార్థులు ఇంగ్లిష్, గణితం చదవడం, రాయడంలో వెనుకబడుతున్నందున ప్రాథమికస్థాయి నుంచే తీర్చిదిద్దాలని తెలిపారు. ఉద్దీపకం, వర్క్ బుక్‌లు పంపిణీ చేసినందున వీటి ఆధారంగా బోధిస్తూ విద్యార్థుల్లో భయాన్ని తొలగించాలని సూచించారు. కాగా, రామచంద్రునిపేట ఏజీహెచ్‌ఎస్ పాఠశాల ఏడో తరగతి విద్యార్థులతో పీఓ కొన్ని లెక్కలు చేయించడమే కాక వారితో పాటు కూర్చుని బోధనను పరిశీలించారు. అనంతరం ఫిజిక్స్, బయాలజీ ల్యాబ్‌లు, రేగుబల్లి–2 ఏజీహెచ్‌ఎస్‌లో విద్యుత్ సరఫరా తీరుపై ఆరా తీశారు. హెచ్‌ఎంలు బట్టు రాములు, భారతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేస్తున్న పీఓ రాహుల్



క్లుప్తంగా

రామక్క జాతరకు తరలిన భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న ఎస్పీ రోహిత్‌రాజ్

గుండాల: ఆళ్లపల్లి మండలం పెద్దూరు గ్రామంలో కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క జాతరకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. గురువారం వనదేవతలను గద్దెలపై ప్రతిష్ఠించారు. మహిళలు పూనకాలతో ఊగిపోయారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు చుట్టుపక్క ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ బాధ్యులు అన్నిఏర్పాట్లు చేశారు.

దర్శించుకున్న ఎస్పీ

రామక్క జాతరకు ఎస్పీ రోహిత్‌రాజు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతర ప్రాశస్త్యాన్ని కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ సురేశ్, ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీశ్, కొమరం వంశీయులు వెంకటేశ్వర్లు, హనుమంతరావు, సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.20 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న రామిరెడ్డి కుటుంబ సభ్యులు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి జాలె రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కుమార్తెలు రూ.1.20 లక్షలు విరాళంగా అందించారు. శుక్రవారం ఆలయం ఆవరణలో ఆలయ నిర్మాణ కమిటీ వారికి అందజేశారు. గతంలో సైతం రామిరెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ నిర్మాణానికి రూ.80,580 అందజేశారు.

ఏసీబీ పేరుతో బెదిరింపు ఫోన్లు

అశ్వాపురం: ఏసీబీ కార్యాలయం అధికారులమంటూ మండలంలోని అధికారులకు శుక్రవారం బెదిరింపు ఫోన్లు వచ్చాయి. ఏసీబీ కార్యాయలం నుంచి మాట్లాడుతున్నామని ఓ వ్యక్తి తహసీల్దార్‌కు ఫోన్‌చేసి ఎంపీడీ ఓ ఫోన్ ఎత్తడం లేదని చెప్పాడు. ఆమె తన ఫోన్ నుంచి ఎంపీడీఓకు ఫోన్ చేయగా ఫోన్ చేసిన వ్యక్తి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని తమపై ఫిర్యాదు వచ్చిందని బెదిరించారు. తర్వాత అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేశారు. దీంతో అధికారులు సీఐ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఫేక్ ఫోన్‌కాల్స్ అని ధ్రువీకరించారు.

చోరీ ఘటనపై కేసు

ములకలపల్లి: మండలంలోని జగన్నాథపురం మెయిన్‌రోడ్డులోని దుకాణంలో చోరీ ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. జగన్నాథపురానికి చెందిన వ్యాపారి జయవరపు నరేశ్ మెయిన్ సెంటర్లో ఇల్లు నిర్మించుకొని ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. నరేశ్ దంపతులు ఈ నెల 15వ తేదీన కుంభమేళాకు వెళ్లారు. మరుసటి రోజు ఇంటి వెనుక తలుపు తాళాలు పగలగొట్టగా పక్కవారు గమనించి నరేశ్‌కు సమాచారం అందించారు. గురువారం కుంభమేళా నుంచి వచ్చి ఇంట్లో పరిశీలించగా రూ.45 వేల విలువ గల బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

గోవిందరావుపేట: అక్రమంగా తరలిస్తున్న 323 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. పస్రామండలం మొద్దులగూడెం శివారులో శుక్రవారం తనిఖీ చేస్తుండగా లారీలో బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. లారీలో రూ.6.47లక్షల విలువైన రేషన్ బియ్యం ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం లచ్చగూడెంకు చెందిన బత్తుల రాజు తరలిస్తున్నట్లు డ్రైవర్ వల్లెపు బంగారి అంగీకరించాడని ఎస్సై తెలిపారు. ఇల్లెందు చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని ఎక్కువ ధరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో అమ్ముతున్నట్లు గుర్తించామని వెల్లడించారు.

ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారిపై వేటు

సత్తుపల్లి: సత్తుపల్లి డివిజన్ ఆయిల్‌ఫెడ్ అధికారి బాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మండలంలోని రేగళ్లపాడు నర్సరీలో ఆఫ్‌టైప్(నాటడానికి పనికి రానివి)గా తేలిన 80వేల ఆయిల్‌పామ్ మొక్కలను అనుమతి లేకుండా ధ్వంసం చేయించినట్లు ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి.ఇందుకోసం వెచ్చించిన నిధులు డ్రా చేసినట్లు తెలుస్తుండగా, ఈనెల 9, 10వ తేదీల్లో ఉద్యానశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు వారిచ్చిన నివేదిక ఆధారంగా బాలకృష్ణను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, గతంలోనే నర్సరీ సూపర్‌వైజర్లు పృథ్వీలాల్, కృష్ణారావును విధుల నుంచి తొలగించిన విషయం విదితమే.

అపు‘రూపం’

▶ ఎక్కడున్నా కవలలకు ప్రత్యేక గుర్తింపు ▶ ఒకే పోలికలతో పలు సందర్భాల్లో తికమక
▶ నేడు కవలల దినోత్సవం

కవలలు (ట్విన్స్) ఎక్కడున్నా ప్రత్యేకత ఉంటుంది. రూపంలో ఒకేరకంగా ఉండటంతో వారిని ప్రత్యేకంగా చూస్తారు. ఒకే రకమైన దుస్తులు, వస్తువులు కొనిపెట్టి అపురూపంగా చూసుకుంటారు. ఇష్టాలు, అభిరుచులు ఒకేలా ఉంటే మరికొందరిలో భిన్నంగా ఉంటాయి. బంధువులు, టీచర్లు, ఇరుగుపొరుగు వారు కూడా గుర్తుపట్టలేక తికమకపడుతుంటారు. ప్రపంచంలో మొదటి సారి కవలలు దినోత్సవాన్ని పోలండ్‌లో 1976లో నిర్వహించారు. మోజస్, అరన్విల్కార్స్ కవలలు ఒకే వ్యాధితో బాధపడుతూ ఒకే రోజు (ఫిబ్రవరి 22) మరణించారు. ఈ రోజున ప్రపంచ కవలల దినోత్సవంగా పోలాండ్ ప్రకటించగా పలు దేశాలు అంగీకారం తెలిపాయి. – పాల్వంచరూరల్/కరకగూడెం

ఇద్దరూ టీచర్లే..

రమాదేవి, ఉమాదేవి



పాల్వంచలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన మధిరకు చెందిన చెల్లూరి కామేశ్వరరావు, విమల దంపతులకు రమాదేవి, ఉమాదేవి కవలలు 1964లో జన్మించారు. ఒకరు చదువులో రాణిస్తే మరొకరు ఆటల్లో రాణించేవారు. ఇద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. ఇద్దరికి తల్లిదండ్రులు ఏదైనా ఒకే రకం తీసుకొచ్చి ఇచ్చేవారు. అక్క రమాదేవి పాల్వంచ మండలం జగన్నాథపురం పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తుండగా చెల్లి ఉమాదేవి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

స్నేహితులుగా కలిసి మెలిసి..

టి.పవన్‌కుమార్, ప్రదీప్



బూర్గంపాడు మండలం జిన్నెగట్టుకు చెందిన సోదరులు పవన్‌కుమార్, ప్రదీప్. పాల్వంచ మండలం కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ మంచి స్నేహితుల్లా కలిసి మెలిసి ఉంటారని తల్లిదండ్రులు కృష్ణ, స్వప్న తెలిపారు. ఏది కొన్నా ఇద్దరికీ కలిపి కొంటామని, ఇద్దరికీ సమానంగా అందిస్తామని చెప్పారు.



అభిరుచులు ఒక్కటే..

కుంజ అభిరాం, లక్ష్మణ్‌పార్థు

పాల్వంచ మండలం దంతలబోరు పంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామానికి చెందిన కవలలు కుంట అభిరాం, లక్ష్మణ్‌పార్థు గ్రామంలోనే 4వ తరగతి చదువుతున్నారు. ఇద్దరి ఇష్టాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయి. ఏదికొన్నా ఇద్దరికీ సమానంగా ఇవ్వాల్సిందే. చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపుతారని తల్లిదండ్రులు భద్రం, వెంకటరమణ తెలిపారు.

ఏదైనా సగం..సగం..

కందుకూరి రుసుమంత్, రేమంత్

పాల్వంచ మండలం జగన్నాథపురానికి చెందిన కవలలు కందుకూరి రుసుమంత్, రేమంత్ అదే గ్రామంలో 3వ తరగతి చదువుతున్నారు. ఇద్దరి ఇష్టాలు ఒకేలా ఉంటాయి. తాము ఏదికొన్నా ఇద్దరికీ ఫిఫ్టీ, ఫిఫ్టీగా ఇస్తామని, అప్పుడే ఇద్దరూ ప్రశాంతంగా ఉంటారని, బాగా అల్లరి చేస్తుంటారని తల్లిదండ్రులు నాగేంద్రబాబు, మణికుమారి తెలిపారు. చదువులోనూ, ఆటల్లోనూ ముందుంటారని వారు పేర్కొన్నారు.





ఒకేరకం దుస్తులు వేసుకుంటారు..

చైత్రన్, చరణ్‌రాజ్

పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మాలోత్ చైత్రన్, చరణ్‌రాజ్ అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నారు. ఇద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. ఇద్దరికీ దుస్తులు కూడా ప్రతిరోజు ఒకేరకంగా వేసుకుంటారని తల్లిదండ్రులు రమేశ్, సరిత తెలిపారు.

ఇష్టాలు వేర్వేరుగా..

జాటోతు ప్రవళిక, ప్రణీత

పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన జాటోతు ప్రవళిక, ప్రణీత అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నారు. ఇద్దరి ఇష్టాలు వేర్వేరుగా ఉంటాయి. అల్లరి చేస్తారు. అక్కాచెల్లెళ్లకు ఏది తీసుకున్నా ఒకే రకం తీసుకుంటామని తల్లిదండ్రులు సూర్యం, దీప తెలిపారు.





గుర్తించడం కష్టం..

సయ్యద్ అర్పియా, ఆసిఫా

కరకగూడేనికి చెందిన సయ్యద్ ఆరిఫ్, రఫియా దంపతులకు అర్పియా – ఆసిఫా కవలలు జన్మించారు. వీరు ఇంట్లో అల్లరి బాగా చేస్తుంటారు. ఒకరిని మించి మరొకరు ఎంతో ఉత్సాహం కనబరుస్తుంటారు. వీరినిచుట్టూ పక్కల వారు పిల్లలు గుర్తుపట్టలేరని, అయోమయానికి గురవుతారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఇద్దరు.. ఇద్దరే..

గగన్ దీక్షిత్, గన్విక

కరకగూడెం మండలంలోని సమత్‌భట్టుపల్లి గ్రామానికి చెందిన నిట్ట శ్యామ్, లాస్య దంపతులకు గగన్ దీక్షిత్, గన్విక ఒకే కాన్పులో జన్మించారు. ప్రస్తుతం వీరు ఎల్‌కేజీ చదువుతున్నారు. ఒకే పోలికలతో కనిపించే వీరు అందరినీ ఆకర్షిస్తారు. అభిరుచులు, ఆలోచనలు, ఇష్టాలు ఒకేరకంగా ఉంటాయని తల్లిదండ్రులు వివరించారు.



ఒత్తిడిని దూరం చేసేందుకే క్రీడాపోటీలు



ఓవరాల్ చాంపియన్ జట్టుకు బహుమతి అందిస్తున్న జానయ్య

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాలల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగుల ఒత్తిడిని దూరం చేసేందుకే విశ్వవిద్యాలయం స్థాయిలో క్రీడాపోటీలను నిర్వహించామని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. శుక్రవారం అశ్వారావుపేట కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జోన్‌స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. వృత్తి రీత్యా ఉండే ఒత్తిడిని తగ్గించేందుకు బోధన సిబ్బందికి ఈ పోటీలను నిర్వహించామని, వారిలోని నైపుణ్యం ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికని పేర్కొన్నారు. దేశానికి అన్నం అందించే రైతుకు మరిన్ని సేవలు అందిస్తే ప్రయోజనకరమని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, జానపద నృత్యాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడా, సాహిత్య పోటీల్లో విజేతలకు వైస్ చాన్స్‌లర్ బహుమతులు అందించారు. తర్వాత జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ జె.సురేశ్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, జి.గోపాలకృష్ణమూర్తి, శిరీష పాల్గొన్నారు.

కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు సిద్ధం



స్టేడియంలో పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో శని, ఆదివారాల్లో జరగనున్న కోలిండియా స్థాయి (పురుషులు, మహిళలు) అథ్లెటిక్స్ మీట్‌కు సింగరేణి కార్పొరేట్ ఏరియా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ టోర్నీ 38 ఈవెంట్లలో జరగనుండగా కోలిండియా పరిధిలోని బొగ్గు పరిశ్రమల నుంచి 284 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. సింగరేణి చరిత్రలో కొత్తగూడెంలో కోలిండియా స్థాయి టోర్నీ జరగడం ఇది రెండోసారి. ఈ పోటీలను శనివారం సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు ప్రారంభించనుండగా, ఆదివారం సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారని అధికారులు తెలిపారు. కాగా, పోటీల ఏర్పాట్లను జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) కవితానాయుడు శుక్రవారం సాయంత్రం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆమె వెంట అధికారులు రాజీవ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, బి.రాజగోపాల్, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకుల వెంటే ఉంటున్నా

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



కొత్తగూడెంలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెంఅర్బన్: నిరంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకుల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నానని వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 2019లో ఎమ్మెల్సీగా గెలిచాక సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లుల విడుదల కోసం ధర్నాల్లో సైతం పాల్గొన్నట్లు చెప్పారు. అలాగే, గురుకులాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు వేతనం పెంపు, బదిలీలకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీగా తనకు కేటాయించిన రూ.9 కోట్ల నిధులను అదనపు తరగతి గదుల నిర్మాణానికి కేటాయించానని వెల్లడించారు. ఈ మేరకు 27న జరగనున్న ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, తద్వారా మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు, హెల్త్ కార్డులు, పదోన్నతులతో పాటు ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడగా యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఏవీ నాగేశ్వరరావు, వెంగళరావుతో పాటు జీవీ నాగమల్లేశ్వరరావు, చావా దుర్గాభవాని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్లు డిపాజిట్ చేసిన వ్యక్తి అరెస్ట్

ఇల్లెందు: ఇల్లెందు ఎస్‌బీఐ ఏటీఎంలో ఓ వ్యక్తి నకిలీ నోట్లు డిపాజిట్ చేసి దొరికిపోయాడు. సీఐ బి.సత్యనారాయణ కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన పి.మల్లికార్జున్ (మధు) ఈ నెల 6వ తేదీన ఇల్లెందులోని ఆంబజార్ ఏటీఎంలో రూ.500 నోట్లు 10 డిపాజిట్ చేశాడు. అందులో 8 నోట్లు నకిలీవని గుర్తించిన బ్యాంకు అధికారులు ఆ ఏటీఎంలో సోదా చేశారు. సీసీ ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలించి డిపాజిట్ చేసింది మల్లికార్జున్(మధు)గా గుర్తించారు. మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఎల్లం చిన్నంనాయుడు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సందీప్ కుమార్ మల్లికార్జున్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆంధ్రాకు కోడి పందేలకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి తెచ్చిన నోట్లు తన ఖాతాలో డిపాజిట్ చేశాడని, అందులో 8 నోట్లు నకిలీవని తేలిందని, చేసి కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

29 మంది బైండోవర్

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని శుక్రవారం పోలీసులు స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏడాది కాలంగా ఇసుక అక్రమంగా రవాణా చేసి, కేసులు నమోదైన 29 మంది ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులను గుర్తించి వారిని స్థానిక తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు.

ప్రెజర్ బాంబు పేలి డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో ప్రెజర్ బాంబు పేలి డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నారాయణపూర్ జిల్లాలోని చోటేడోంగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడిమెట్ల, కవ్నార్ ప్రాంతాల్లో డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. పోలీస్ బలగాలను లక్ష్యంగా చేసుకొని ఆ ప్రాంతంలో మావోయిస్టులు ప్రెజర్ బాంబులను ఏర్పాటు చేశారు. గమనించకుండా డీఆర్‌జీ జవాన్ ప్రెజర్ బాంబును తొక్కడంతో అది పేలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చోటేడోంగర్‌కు తరలించి.. అక్కడ నుంచి నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

జేసీబీ, ఐదు ట్రాక్టర్లు సీజ్

తొమ్మిది మందిపై కేసు నమోదు



జేసీబీ, ట్రాక్టర్లతో ఎస్‌ఐ రవి, సిబ్బంది

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామ పంచాయతీ పంతులుతండా గ్రామ సమీపంలోని పెద్దవాగు ఇసుకను అక్రమంగా జేసీబీతో తవ్వి, ఐదు ట్రాక్టర్లతో తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. చింతలతండాకు చెందిన భూక్యా రాందాస్ పెద్దవాగులోని ఇసుకను జేసీబీతో తవ్వి, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎస్‌ఐ రవి తన ఘటనా స్థలానికి వెళ్లి పట్టుకున్నారు. వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కొత్తగూడెంకు చెందిన జేసీబీ డ్రైవర్ పగడాల వేణు, భేతాళపాడు జీపీ టాక్యాతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు ధరావత్ రాందాస్, నునావత్ భీమా, బానోత్ కస్నా, గుగులోత్ సక్రు, ట్రాక్టర్ యజమానులు బానోత్ లక్ష్మణ్, బానోత్ కస్నా, బానోత్ అనిత, చింతలతండాకు చెందిన భూక్యా రాందాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని కొత్తకాలనీలో ఓ యువకుడు ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన జక్కుల అరవింద్ (22) తన మేనమామ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. ఇంతకు ముందు కూడా అతడు పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగులమందు తాగి వ్యక్తి...

పాల్వంచరూరల్: కుమారుడిని మృతిని తట్టుకోలేక మనస్తాపానికి గురైన ఓ తండ్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తోగ్గూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన మొడియం కృష్ణ (45).. కుమారుడు సాంబయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటినుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. శుక్రవారం పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. గుర్తించిన ఆయన బంధువలు మహేశ్ పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతిడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

దాడికి పాల్పడిన మహిళకు ఏడాదిన్నర జైలు

కొత్తగూడెంటౌన్: కోర్టులో విచారణకు హాజరైన వ్యక్తిపై దాడికి పాల్పడినందుకు పాల్వంచ వెంకటేశ్వరకాలనీకి చెందిన కొడాలి నర్మదకు ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత తీర్పు చెప్పారు. 2017, ఫిబ్రవరి 28న కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు విచారణలో భాగంగా హాజరైన పాల్వంచ మండలం ఇల్లెందులపాడుకు చెందిన గుగులోత్ మాన్‌సింగ్‌ను.. కోర్టు హాల్‌లో జడ్జి ఎదుట కొడాలి నర్మద బూతులు తిడుతూ దాడికి పాల్పడింది. ఈ ఘటనపై అప్పటి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.జమలేశ్వరావు, కోర్టు సూపరింటెండెంట్ రషీద్‌అలీఖాన్ 2017 మార్చిలో కొత్తగూడెం వన్‌టౌన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. ఏడుగురు సాక్షులను విచారించి, కొడాలి నర్మదపై నేరం రుజువైనందున జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నాగలక్ష్మి వాదించగా.. నోడల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, లైజన్ ఆఫీసర్ అబ్దుల్ ఘని, కోర్టు పీసీ కామేశ్ సహకరించారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి



లాస్య (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజుల కిందట విద్యుదాఘాతానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక శుక్రవారం మృతి చెందింది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం మేరకు.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన కేతా లాస్య (13) ఈ నెల 16న దుస్తులు ఆరేసేందుకు డాబాపైకి వెళ్లింది. తడి బట్టలను ఆరేస్తున్న క్రమంలో ఇంటిపై నుంచి వెళ్లిన 33 కేవీ విద్యుత్ లైన్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. బాలికను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. బాలిక తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యయాతి రాజు పేర్కొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Services

FINANCE SERVICES

■ శ్రీ శివశక్తి లోన్స్ అతితక్కువ వడ్డీకే లోన్ చేయబడును. బిజినెస్ మార్టిగేజ్, హోమ్‌లోన్స్, టేక్ ఓవర్ లోన్స్. ఏజెంట్లు కావలెను. శ్రీనివాస థియేటర్ దగ్గర, ఖమ్మం. 9700123149, 85007 63746. [SCA-25001821]

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. PMEGP UNIT WISE కుడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 8790379618. [WA-6558]

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

Wanted

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [M-SCA25001809]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001803]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

